క్లుప్తంగా

వికలాంగుల ఎదుగుదలకు సహకరించాలి



కొల్లిపర: సమాజంలో వికలాంగులుగా ఉన్న ప్రతి ఒక్కరినీ ఆప్యాయత అనురాగాలతో వారిని దరిచేర్చుకుని, జీవితంలో ఎదుగుదలకు ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని అప్పుడే వారికి సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని ప్రధానోపాధ్యాయుడు మృత్యుంజయరావ్ అన్నారు. కొల్లిపర గ్రామంలోని భవిత కేంద్రంలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవ వేడుకలు భవిత కేంద్రం ఉపాధ్యాయులు సురేష్, పాపయ్య ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మృత్యుంజయరావ్ మాట్లాడుతూ అంధులకు ప్రత్యేక లిపి కనిపెట్టిన ఫ్రెంచ్ విద్యావేత్త టాయిస్ బ్రెయిలీ మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐఈడీఎస్ఎస్ శాంత కుమారి, వికలాంగులు పాల్గొన్నారు.

రేపు న్యాయవాది వరప్రసాద్ సంస్మరణ



తెనాలి: ఇటీవల మృతిచెందిన ప్రముఖ న్యాయవాది, కళాపోషకుడు, వేదగంగోత్రి ఫౌండేషన్-విజయవాడ వ్యవస్థాపకుడు డాక్టర్ జీవీ ఎన్ఆర్ఎస్ఎస్ వరప్రసాద్ సంస్మరణను ఈనెల 6న తెనాలిలో నిర్వహించనున్నారు. ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటయ్యే సభకు కళల కాణాచి ఉపాధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహిస్తారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, సినీ రచయిత ఎంవీ శాస్త్రి (విస్సు), సినీనటుడు వేమూరి విజయభాస్కర్, సినీదర్శకుడు రాజా వన్నెంరెడ్డి, విశ్రాంత న్యాయమూర్తి మాధవరావు పట్నాయక్, పలువురు న్యాయవాదులు, కళాప్రముఖులు పాల్గొంటారని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలియజేశారు. సభానంతరం 7.30 గంటలకు న్యూ మోడరన్ థియేటర్స్, విజయవాడ వారి 'కాంట్రావర్సీ' సాంఘిక నాటికను ప్రదర్శిస్తారు. డాక్టర్ ఎంఎస్ చౌదరి రచించిన నాటికను ఆయన దర్శకత్వంలోనే ప్రదర్శిస్తారు.

పంచాయతీ కార్మికుల పోరాటానికి మద్దతు



ఫిరంగిపురం: చేబ్రోలు పంచాయతీ కార్మికులను అక్రమంగా తొలగించడంపై ఫిరంగిపురం పంచాయతీ వర్కర్స్ యూనియన్ శనివారం నిరసన వ్యక్తం చేసింది. సీఐటీయూ మండల కార్యదర్శి మస్తాన్ వలి మాట్లాడుతూ తొలగించిన కార్మికులను తిరిగి పనుల్లోకి తీసుకోవాలని చేస్తున్న పోరాటానికి మద్దతు తెలుపుతున్నామని చెప్పారు. ఎటువంటి సమాచారం లేకుండా వారిని తొలగించడంపై నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రామారావు, నాయకులు శ్రావణ్, బాలయ్య, ఇబ్రహీం, సతీష్, వెంకటేశ్వరమ్మ, సునీత, హనోక్, రామారావు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



ఫిరంగిపురం: వేమవరం, కండ్రిక గ్రామాల పంచాయతీ కార్యాలయాల వద్ద శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పాసు పుస్తకాలకు సంబంధించి రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. సర్వేయర్ జి.వెంకటేశ్వర్లు, ఆర్ఐ అబ్దుల్ రెహమాన్, వీఆర్వో షేక్.సుబాని, మండవ నరసింహారావు, సీహెచ్ హనుమంతురావు, అప్పయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఒకేషనల్ టూర్



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఒకేషనల్ టూర్ నిర్వహించారు. వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ సందర్శనకు తీసుకెళ్లారు. ఒకేషనల్ టీచర్ ఝాన్సీ మాట్లాడుతూ హెచ్ఎం కె.ఆంటోని రాజు సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించామని తెలిపారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఇతర విషయాలను వర్సిటీ యాజమాన్యం వివరించిందని చెప్పారు. ఒకేషనల్ టీచర్ సరోజ పాల్గొన్నారు.

10 నుంచి 'ఆషా'లో బొమ్మపడుతోంది

- 14 ఏళ్ల క్రితం మూతపడిన ఆషా థియేటర్
- మళ్లీ సరికొత్తగా ప్రేక్షకుల ముందుకు



తుది మెరుగులు దిద్దుకుంటున్న ఆషా థియేటర్

తెనాలి: ఆంధ్రా ప్యారిస్ తెనాలిలో సినిమా థియేటర్లు వరుసగా మూతపడుతున్నాయి. వైభవంగా వెలుగొందిన థియేటర్లు ఒకటొకటిగా కనుమరుగవటం సినీ అభిమానులకు విచారాన్ని కలిగిస్తోంది. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో ఎంతో కాలంగా మూతపడివున్న ఆషా డీలక్స్ థియేటర్ మళ్లీ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సరికొత్త మోడల్‌గా థియేటర్ రెనోవేషను పూర్తిచేసుకుని, అత్యాధునిక సౌకర్యాలతో ఆటకు సంసిద్ధమైంది. ఈనెల 10న 'గేమ్ ఛేంజర్'తో తొలి షో మొదలుకానుంది.

రత్నా టాకీస్, శ్రీవెంకటేశ్వర, శ్రీసత్యనారాయణ, స్వరాజ్... ఇవన్నీ తెనాలిలో ఒకప్పుడు ఉజ్వలంగా వెలిగి అదృశ్యమైన సినిమా థియేటర్లు. ప్రేక్షకులకు వెండితెర వినోదాన్ని అందించిన థియేటర్లు ఇవి. కొన్నేళ్లుగా ఒకదాని తర్వాత మరొకటిగా మూతపడుతూ వచ్చాయి. తర్వాత అవన్నీ షాపింగ్ కాంప్లెక్సులు/కల్యాణమండపాలుగా మారాయి. ప్రస్తుతానికి నడుస్తున్న థియేటర్లలో కొన్నింటిని అతికష్టంమీద నడిపిస్తున్నారు. సినిమాల విడుదల తగ్గిపోయి థియేటర్ల నిర్వహణ భారంగా మారటమే ఇందుకు కారణమని తెలిసిందే.

ఒకప్పుడు వెండితెరకు స్వర్ణయుగం. ఒక్కో హీరో ఏడాదికి పదికి పైగా సినిమాల్లో నటించేవారు. తెనాలి సమీపంలోని బుర్రిపాలెం హీరో 'సూపర్‌స్టార్' కృష్ణ, మరో హీరో మురళీమోహన్ పోటాపోటీగా ఒకే ఏడాది 17, 18 సినిమాల్లో నటించిన రికార్డు ఉంది. సినిమా థియేటర్లు వరుస సినిమాల విడుదలతో కళకళలాడుతుండేవి. ప్రేక్షకులు ఆదరించిన సినిమాలు శతదినోత్సవాలు, రజతోత్సవాలను జరుపుకునేవి. దేవదాసు సినిమా రెండో రిలీజప్పుడు తెనాలిలో 300 రోజులు ఆడిందంటే ఇప్పటి ప్రేక్షకులకు అంత నమ్మశక్యం కాకున్నా వాస్తవం.

పట్టణ రైల్వేస్టేషనుకు దగ్గర్లోనే ఆషా డీలక్స్ థియేటర్ ఉంది. ఈ థియేటర్ పక్కనే ప్రియా, సంగమేశ్వర కాంప్లెక్సులు నడుస్తున్నాయి. రెండు కాంప్లెక్సుల్లో నాలుగు థియేటర్లున్నాయి. పక్కనే మూతపడి కళావిహీనంగా ఉన్న ఆషా డీలక్స్‌ను చూసే ప్రేక్షకులకు ఒకనాటి ఈ థియేటర్ వైభవం కళ్లకు కట్టేది. 1981లో ఫణిచక్రవర్తి అనే వ్యాపారి నిర్మించారు. ఈ థియేటర్‌లో తొలిరోజున సూపర్‌స్టార్ కృష్ణ ప్రజారాజ్యం, మిథున్ చక్రవర్తి నటించిన డిస్కో డాన్సర్ సినిమాలు ప్రారంభ చిత్రాలుగా వేశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, మురళీమోహన్, కృష్ణంరాజు వంటి హీరోల సినిమాలను ఎన్నింటినో ప్రదర్శించారు. పెదరాయుడు, సూరిగాడు, తాండ్ర పాపారాయుడు, బొబ్బిలి బ్రహ్మన్న, కూలీ వంటి ఎన్నో సినిమాలు ఇందులో ఆడాయి. ఈ సినిమా థియేటర్ కూడా వివిధ కారణాలతో 2010 ప్రాంతంలో మూతపడింది.

కళతప్పిన ఈ థియేటరులోని వెండితెర మళ్లీ సినిమాను అద్దుకుంటుందన్న భావన ఎవరిలోనూ లేదు. ఏదోకరోజు ఏ షాపింగ్ కాంప్లెక్సో, మరో కల్యాణ మండపంగానో మారుతుందని అనుకునేవారు. చిత్రంగా థియేటరు రెనోవేషన్ పనులను గతేడాది ప్రారంభించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని ప్రకటించారు. ఇది ప్రేక్షకులకు నిజంగా సంభ్రమాశ్చర్యమే. ఎదురుచూసినట్టే థియేటర్ సంసిద్ధమైంది. ఆధునిక సాంకేతిక హంగులను సమకూర్చుకుంది.

ఈనెల 10న విడుదల కానున్న దర్శకుడు శంకర్ సినిమా 'గేమ్ ఛేంజర్'తో ఆషా థియేటర్‌లో తొలి షో మొదలుకానుంది. తెనాలిలో మూతపడిన థియేటర్లలో మళ్లీ ప్రేక్షకుల ముందుకొచ్చిన ఏకైక థియేటర్‌గా నిలిచింది.

ఇంటర్నెట్ పుణ్యమాని...



టీవీ, ఇంటర్నెట్ పాపులర్ అయ్యాక సినిమాలకు వెళ్లే ప్రేక్షకుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. నేటి తరం హీరోలు సినిమాల సంఖ్యను బాగా తగ్గించేశారు. ఏడాదికి ఒక సినిమా కూడా చేయటం లేదు. రెండు మూడేళ్లకో సినిమాల్లో తాపీగా నటిస్తున్నారు. ఫలితంగా థియేటర్లలో సినిమాల విడుదలకు వెతుక్కోవాల్సి వస్తోంది. దీనికితోడు ఓటీటీ సినిమా ప్రభావం ఉండనే ఉంది. ఇన్ని కారణాలతో సినిమా థియేటర్ల నిర్వహణ అతి భారంగా మారింది. నిర్వహణ ఖర్చులు భరించలేక ఒక్కో సినిమా థియేటర్ మూతపడుతూ వస్తోంది.

సినిమా థియేటర్ కొనసాగాలని...



మా తండ్రి నిర్మించిన థియేటర్ అనివార్య కారణాలతో మూతపడింది. మళ్లీ సినిమాగానే ప్రేక్షకుల ముందుకు రావాలనే భావనతో రెనోవేషన్ చేశాం. ముంబయితో సహా పలు నగరాల్లోని థియేటర్లను సందర్శించి హార్క్‌నెస్ కంపెనీ బిగ్ స్క్రీన్, డాల్బీ ఎట్‌మాస్ సౌండ్ సిస్టం, ప్రత్యేకమైన సీటింగ్‌తో థియేటరును సిద్ధంచేశాం. ట్రయల్స్ అన్నీ బాగున్నాయని ప్రశంసలు వస్తున్నాయి. సినీప్రేక్షకులు ఆదరిస్తారని నమ్ముతున్నా.

– డాక్టర్ ఆరవీటి జస్వంత్, థియేటర్ యజమాని

ఎంతో పేరున్న థియేటర్లు!



ప్రదర్శనకు సిద్ధంగా ఉన్న థియేటర్ లోపలి భాగం

పట్టణంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన శ్రీవేంకటేశ్వర థియేటర్, రత్నా టాకీస్‌లు మూసేశారు. వాటి స్థానంలో షాపింగ్ కాంప్లెక్సులు వచ్చాయి. ప్రముఖ సినీనటి లక్ష్మీరాజ్యం, తన ప్రియమైన స్నేహితురాలు కాంచనమాల కోసమని ఇక్కడే ఇల్లు, సినిమా థియేటర్‌ను నిర్మించుకున్నారు. బోసురోడ్డు చివర్లో ఆమె ముచ్చటపడి నిర్మించుకున్న రాజ్యం థియేటర్, తర్వాతికాలంలో చేతులు మారింది. నిర్వహణ భారం కావటంతో కల్యాణ మండపంగా పెళ్లిళ్లకు వేదికగా మారింది. శ్రీసత్యనారాయణ టాకీస్ ఫంక్షన్‌హాలుగా మారింది. వేద డీలక్స్ స్థానంలో షాపింగ్ మాల్ నిర్వహిస్తున్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన మరుసటి ఏడాది స్వరాజ్ పేరుతో బోసురోడ్డులో నిర్మించిన స్వరాజ్ టాకీస్‌ను కొంతకాలం మూసేసి 2021లో కూల్చేశారు. గతేడాది అదే బోసురోడ్డులోని వీనస్ థియేటర్ కూడా అదృశ్యమైంది. ఈ రెండు ప్రదేశాల్లోనూ ఏ షాపింగ్ కాంప్లెక్సులో రానున్నాయి. బోసురోడ్డు, ఆ పరిసరాల్లోని అయిదు థియేటర్లలో ఇప్పుడు కేవలం పెమ్మసాని థియేటర్ మాత్రమే నడుస్తోంది. మొత్తంమీద పట్టణంలో తొమ్మిది సినిమా హాళ్లు ఉండగా వీటిలో మూడు జంట థియేటర్లు. మిగిలిన మూడు ఒంటరి థియేటర్లలో రెండు భారంగా నడుస్తున్నాయి.

అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తాం

రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ గోపాలకృష్ణ



అర్జీదారుతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చే అర్జీలను త్వరితగతిన పరష్కరిస్తామని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తెలిపారు. తెనాలి మండలం నేలపాడు గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఉదయం నుంచి జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోమవరపు నాగమల్లేశ్వరరావు, తహసీల్దార్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామస్తులు, రైతులు తమ తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ సదస్సులో రైతులు వారికి సంబంధించిన టువంటి పలు సమస్యల్ని వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని, అలానే ప్రజా సమస్యలు కూడా పరిష్కారం చేస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఒకటి, సర్వే కోసం 42 అర్జీలు వచ్చాయి. దేవదాయ శాఖ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నిర్ణీత వ్యవధిలో పారిశుద్ధ్య పనులు పూర్తి

ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్

తెనాలి: పారిశుద్ధ్య పనులు నిర్ణీత వ్యవధిలో కచ్చితంగా అమలుకావాల్సిందేనని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగరాదని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్ స్పష్టంచేశారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పథకంలో భాగంగా గత రెండురోజులుగా పట్టణ 35, 36 వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఛైర్‌పర్సన్ ఆయా వార్డుల కౌన్సిలర్లతో కలిసి శనివారం పరిశీలించారు. సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. వార్డు కౌన్సిలర్లు గొడవర్తి హరేరామ్, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, పట్టణ ప్రణాళిక అధికారి సాంబశివరావు, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నజీర్, ఏఈ జానీబాషా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పశు కిసాన్ క్రెడిట్‌కు 400 దరఖాస్తులు



రైతుకు పశు ధృవీకరణ పత్రం అందజేస్తున్న పశువైద్యాధికారి పీర్ అహ్మద్

ఫిరంగిపురం: పశు కిసాన్ క్రెడిట్ కార్డుల కోసం 400కు పైగా రైతుల నుంచి దరఖాస్తులు అందాయని సుదురుపాడు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ అన్నారు. వైద్యశాలలో శనివారం రైతులకు పశువులున్నాయని తెలిపే ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులున్న వారు దాణా, పశు గ్రాసం కోసం బ్యాంకు ద్వారా రుణస దుపాయం పొందేందుకు పశు కిసాన్ క్రెడిట్ కార్డు పథకం ఉన్నట్లు వెల్లడించారు. ఒక్కో పశువుకు సరాసరి రూ.30 వేల వరకు ఆరు పశువులకు రూ.1.60 లక్షల వరకు 7 శాతం వడ్డీతో రుణం అందజేస్తారని తెలిపారు. దానికోసం పశువులున్న రైతులు వైద్యాధికారి వద్ద పశు ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. బ్యాంకు ఖాతా ఉన్న రైతులు అప్లికేషన్లు అందజేయాలని సూచించారు. పంట రుణం ఉన్న వారు కూడా ఈ రుణం కోసం నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఇప్పటికే 2024– 2025 సంవత్సరానికి సంబంధించి కొత్తగా నమోదైన వారు, రెన్యూవల్ అయిన 500 మంది రైతులకు దాణ కోసం రుణాలు మంజూరు అయ్యాయని తెలిపారు. ఏడాదిలోగా నగదు చెల్లించిన వారికి మూడు శాతం వడ్డీ రాయితీ లభిస్తుందని చెప్పారు.

7,8,10 తేదీల్లో ప్రజాభిప్రాయ సేకరణ

తెనాలిరూరల్: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ శాఖకు సంబంధించి అగ్రిగేట్ రెవెన్యూ రిక్వైర్‌మెంట్, రిటైల్ సప్లై టారిఫ్‌ల పై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాభిప్రాయ సేకరణను చేపట్టనుందని తెనాలి విద్యుత్ శాఖ ఈఈ వీవీ. చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 7, 8 తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీ ఎ-కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంటలవరకు ముఖాముఖి ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతాధికారులు ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటారని వివరించారు. అలానే 10వ తేదీన కర్నూలులోని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ముఖాముఖి ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయ సేకరణ ఉంటుందని చెప్పారు. తమ అభిప్రాయాలను తెలియజేయాలనుకున్న వినియోగదారులు ముందుగా తమ పేర్లను www.aperc.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ తెనాలి విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో జరుగుతుందన్నారు.

మూగ జీవాలను రక్షించుకోవాలి

డీజీఈ డాక్టర్ రామ్ ప్రసాద్



పశువైద్యశాలను ప్రారంభిస్తున్న డీజీఈ డాక్టర్ రాంప్రసాద్

తాడేపల్లిరూరల్ : మూగ జీవాలను, ప్రకృతిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీజీఈ డాక్టర్ రాంప్రసాద్ అన్నారు. శనివారం మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మరమ్మతులు నిర్వహించిన మంగళగిరి ప్రాంతీయ పశు వైద్యశాలను గుంటూరు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నరసింహారావుతో కలసి ఆయన ప్రారంభించారు. పశు వైద్యశాలను రూ.3 లక్షలతో ఆధునీకరించిన మంగళగిరి రోటరీ క్లబ్ సభ్యులను అభినందించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ నరసింహారావు పశువైద్య శాల ఆవరణలో మొక్కలు నాటారు. మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు, ప్రాంతీయ పశువైద్యశాల వైద్యులు డాక్టర్ పివి శ్రీనివాసరావు, రొటేరియన్స్ అన్నే రత్న ప్రభాకర్, అనిల్ చక్రవర్తి, వి. శ్రీనివాసరావు, అందే మురళీకృష్ణ, ప్రగడ రాజశేఖర్, కాపరౌతు సుందరయ్య, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మూరు మైనర్‌బాబు, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యానికి కార్మికులు బలి కావల్సిందేనా?



తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులపై గత 32 సంవత్సరాలుగా పాలక పక్షాలు చూపుతున్న నిర్లక్ష్యానికి కార్మికులు బలి అవ్వాల్సిందేనా.. అని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం ఏసీసీ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి, మద్దతు తెలిపారు. 171 మంది కార్మికులు అనారోగ్యాలకు గురై మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కార్మికులకు నష్టపరిహారం అందించాలని కోరారు. ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని గుర్తుచేశారు. దీక్ష శిబిరంలో ఎం.శారద, బి.నవనీతం, వి.లక్ష్మి, డి.రమాదేవి, శివకుమారి, సూర్యప్రకాష్, అంకయ్య, ఆశీర్వాదం, సాంబయ్య, ఆరిఫ్, ఇస్మాయిల్, ఎం. గురవయ్య, వై.సుబ్బారావు, రమాదేవి, సారమ్మ, సామ్రాజ్యం, శివనాగలక్ష్మి పాల్గొన్నారు.

మేజర్ కాలువలో గుర్రపుడెక్క తొలగింపు



ఫిరంగిపురం: మండల పరిధిలోని సాగర్ కాలువ గుర్రపు డెక్కను డీసీ 13 ఛైర్మన్ నల్లజర్ల రవికుమార్ చొరవతో పొక్లెయిన్ ద్వారా శనివారం తొలగించారు. పనులను ఛైర్మన్ ప్రారంభించారు. మేడికొండూరు డీసీ పరిధిలోని 39ఆర్ చిరుమామిళ్ల మేజర్ 39బీఎల్ మైనర్ కాలువ కింద బేతపూడి, వేమవరం, 113 తాళ్లూరు, కండ్రిక, నుదురుపాడు వరకు ఆరు కిలోమీటర్ల వరకు గుర్రపు డెక్కతో ఆయకట్టు రైతులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ఇరిగేషన్ ఏఈ సుందరరావు, అప్పయ్య, చెక్కా హనుమంతురావు, అంచుల శంకరరావు, వెంకటేశ్వర్లు, ఐదు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సంక్రాంతి క్రీడా పోటీలు ప్రారంభం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా దోస్త్ ఓపెన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆటలు, మహిళలకు ముగ్గుల పోటీలను ఎస్ఐ వెంకటరవి ప్రారంభించారు. సాంప్రదాయబద్ధంగా ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

11న కవితా సంకలనం 'స్వప్న వేణువు' ఆవిష్కరణ

తెనాలి: పట్టణానికి చెందిన ఉపాధ్యాయిని, కవయిత్రి కొలకలూరి దేవికారాణి రచించిన కవితా సంకలనం 'స్వప్న వేణువు' పుస్తకావిష్కరణ ఈనెల 11వ తేదీన జరుగుతుందని శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఆరోజు సాయంత్రం 4 గంటలకు ఏర్పాటయ్యే సభకు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ముఖ్యఅతిథి. ప్రముఖ రచయిత, దర్శకుడు జె.బాలవర్ధిరాజు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. కవయిత్రి షేక్ అస్మతున్నీసా, రచయితలు పింగళి భాగ్యలక్ష్మి, శిఖా ఆకాష్, ఐడీబీఐ బ్యాంక్ అత్తోట యశ్వంత్‌బాబు, ఈఎల్‌వీ అప్పారావు పాల్గొంటారు. ఒంగోలుకు చెందిన విద్యాధర ప్రభాస కార్యక్రమ నిర్వాహకులు.

అతివల చదువుపై కవితాగోష్టి

తెనాలి: శ్రీశ్రీ కళావేదిక, గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహనీయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని శనివారం సాయంత్రం నిర్వహించారు. పట్టణ నాజరుపేటలోని కమలశ్రీ సాహితీ నిలయంలో ఏర్పాటైన సాహిత్య సభకు శ్రీశ్రీ కళావేదిక, జిల్లా కమిటి అధ్యక్షుడు డాక్టర్ రంగిసెట్టి రమేష్ (గంగాశ్రీ) నిర్వహణలో 'అతివల చదువు... అవనికే వెలుగు' అంశంపై కవితా గోష్టి జరిపారు. 'సహజకవి' అయినాల మల్లేశ్వరరావు, విష్ణుమొలకల భీమేశ్వర ప్రసాద్, చందు సూర్య, పాతూరి సుబ్రహ్మణ్యం, ఆళ్ల నాగేశ్వరరావు, భీమవరపు అప్పిరెడ్డి, కొప్పరాజు విజయసారథిబాబు, తన్నీరు శివశంకర్, షేక్ అస్మతున్నిసా, ఆళ్ల సుజాత, కారంచేటి విజయకుమార్, నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి, కవితలు చదివారు. ముఖ్య అతిథి నాగిసెట్టి వివేకానంద మాట్లాడుతూ, తొలిగా బాలిక పాఠశాలలను స్థాపించి, బాలికలకు విద్యద్వారా వారి అభివృద్ధికి కృషిచేసిన మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే స్త్రీ జాతికి మార్గదర్శిగా నిలిచారని చెప్పారు. మహిళాలోకం ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. శ్రీశ్రీ కళా వేదిక తరపున ఆళ్ల సుజాతను సావిత్రీబాయిపూలే పురస్కారంతో సత్కరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఆళ్ల నాగేశ్వరరావు మాట్లాడారు. తొలుత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

అంగన్‌వాడీ బోధనపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు చిన్నారుల తల్లిదండ్రులకు చిన్నారులకు ఎటువంటి ఆటలు నేర్పిస్తున్నారు, పాఠాల బోధనపై వివరించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటలతో పాటు పాటలు, పద్యాలు, గేయాలు నేర్పిస్తామని, తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు, ఆయాలు పాల్గొన్నారు.

సంఖ్యా జ్ఞానంపై శిక్షణ

ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని ఐసీడీఎస్ పరిధిలోని పలు గ్రామాల్లో చిన్నారులకు శనివారం ఈసీసీఈ(ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డే) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ వెంకటేశ్వరమ్మ 5వ వార్డు అంగన్‌వాడీ సెంటర్లో చిన్నారులకు సంఖ్యా జ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఇ.సామ్రాజ్యం, ఆయా షేక్.షర్మిల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

గుంటూరు రూరల్: ఇంటిముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన ప్రత్తిపాడు మండలం యనమదలలో చోటు చేసుకుంది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాలు.. యనమదల గ్రామం కొండ్రుపాడు డొంక వైపున ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానం వెనుక ఉన్న ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని దుండగులు రాత్రి సమయంలో చోరీ చేశారు. అర్ధరాత్రి సమయంలో ఇద్దరు ఇంటిముందు ఉంచిన వాహనాన్ని తీసుకెళ్లారని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడి ఇంటిలోని సీసీ కెమెరాలో రికార్డ్ అయిన దృశ్యాల మేరకు దుండగులు ఎటువెళ్లారు, అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.